GSTIN-NO:36FKPSI308PIZX
epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 6 | సంచిక : 213 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శనివారం : మార్చి 16-2024 | పేజీలు : 3

## పడవ ప్రమాదం..16 మంది మృతి

**టీ మీడియా, మార్చి 15,తుర్కియే:** తీరంలో విషాదం చోటుచేసుకుంది. సముద్రంలో వలసదారులతో ప్రయాణిస్తున్న రబ్బరు పడవ ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో 16 మంది మరణించినట్లు తుర్కియే కోస్ట్‌గార్డ్ వెల్లడించింది. మరణించిన వారిలో నలుగురు పిల్లలు ఉన్నట్లు స్థానిక వార్తా కథనాలు పేర్కొన్నాయి. కనక్కలే ప్రావిన్స్‌లోని ఎసేబాత్ పట్టణానికి సమీపంలోని తీర ప్రాంతంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు గవర్నర్ ఇల్హామీ అక్తాస్ తెలిపారు. పడవలో ప్రయాణిస్తున్నవారిలో ఇద్దరిని కోస్ట్ గార్డ్ సిబ్బంది రక్షించారు. ప్రమాద సమయంలో పడవలో ఎంతమంది ప్రయాణిస్తున్నారనే దానిపై స్పష్టత లేదన్నారు. వీరంతా ఎక్కడినుంచి బయల్దేరారు? ఏ దేశానికి చెందినవారు? ఎక్కడికి వెళుతున్నారనేది తెలియరాలేదు. గల్లంతైన వారి కోసం కోస్ట్‌గార్డ్ సిబ్బంది రెండు హెలికాప్టర్లతో గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఇల్హామీ తెలిపారు. మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా దేశాల నుంచి చాలామంది తుర్కియే మీదుగా గ్రీకు, ఇటలీతోపాటు యూరప్ దేశాలకు వెళుతుంటారు. ఇటీవలకాలంలో కోస్ట్ గార్డ్ నిఘా పెరగడంతో వీరి సంఖ్య తగ్గిందని స్థానిక అధికారి తెలిపారు. గత వారం తుర్కియే సముద్రతీరంలో అక్రమంగా ప్రయాణిస్తున్న 93 మంది వలసదారులను కోస్టు గార్డు సిబ్బంది పట్టుకున్నారు.

# లిక్కర్ స్కామ్‌తో.. నేతల్లో కలకలం..

## ఢిల్లీ నుండి తెలంగాణ దాకా ప్రకంపనలు

**టీ మీడియా, మార్చి 15,ఢిల్లీ:**

ఢిల్లీ లిక్కర్ స్కామ్ దేశవ్యాప్తంగా ప్రకంపనలు రేపుతున్న హై ప్రొఫైల్ కేసు. ఇది ఇప్పటికే చాలామంది నేతలను జైలు పాలు చేసింది. మరికొందరు నేతల పీక మీద కత్తిలా వేలాడుతున్న ఈ కేసు మూలాలను ఈడీ, సీబీఐ, ఐటీ లాంటి దర్యాప్తు సంస్థలు చాలా కాలం నుంచి తవ్వుతున్నాయి. ఈడీ, సీబీఐ రంగప్రవేశంతో దాదాపు రెండేళ్ల కిందట ఈ కుంభకోణం బయటపడింది. 2021 నవంబర్‌లో ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ సర్కార్ ప్రవేశపెట్టిన లిక్కర్ పాలసీలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. మద్యం అమ్మకాలను ప్రైవేటు కంపెనీలకు ధారాదత్తం చేస్తూ, ఢిల్లీ ప్రభుత్వం పాలసీని మార్చింది. అయితే ఆ తర్వాత ఢిల్లీకి కొత్త చీఫ్ సెక్రటరీ రావడంతో ఈ స్కామ్ బయటకు వచ్చింది. ఆయన దీనికి సంబంధించి సమగ్ర నివేదిక రూపొందించి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు అందజేశారు.

### 2022 జూలైలో సీబీఐ ఎంక్వైరీ షురూ

2022 జూలైలో ఈ కేసులో సీబీఐ విచారణకు ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే అదే సమయంలో కొత్త పాలసీతో ఆదాయం పెరగడం లేదంటూ దాన్ని రద్దు చేసింది ఢిల్లీ సర్కార్. ఈ కుంభకోణానికి సంబంధించి మద్యం దుకాణాల కేటాయింపుల్లో నిబంధనలకు విరుద్ధంగా గుత్తాధిపత్యం కనిపించింది. ఎల్ 1 కేటగిరీ లైసెన్సుల జారీలో లంచాలు తీసుకుని పర్మిషన్లు ఇచ్చారనే ఆరోపణలు వచ్చాయి. అప్పటి ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా అనుచరుడు దినేష్ అరోరా కంపెనీకి ఓ మద్యం వ్యాపారి.. కోటి రూపాయలు తరలించినట్టుగా ఆరోపణలు వచ్చాయి. రిటైల్ వెండర్లకు క్రెడిట్ నోట్లు జారీ చేసి, లంచాలు ఇచ్చినట్టుగా అధికారులు గుర్తించారు. ఈ కుంభకోణంలో సిసోడియా అనుచరులు దినేష్ అరోరా, అమిత్ అరోరా, అర్జున్ పాండేలు కీలక పాత్ర పోషించినట్లు తేలింది. ఇక అక్కడ నుంచి ఈ కేసు కొత్త మలుపులతో సరికొత్త సంచలనాలతో ముందుకు సాగింది.

> ఢిల్లీ నుంచి గల్లీ దాకా లిక్కర్ స్కామ్ ప్రకంపనలు పుట్టిస్తోంది. ఢిల్లీ టు తెలంగాణ వయా ఆంధ్రప్రదేశ్ అన్నట్టు.. చాలామంది నేతల పీకకు ఈ కుంభకోణం చుట్టుకుంది. తాజాగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇంట్లో ఈడీ, ఐటీ అధికారులు ఏకకాలంలో సోదాల జరపడుం కలకలం రేగింది. ఆమెను ఈడీ అధికారులు అరెస్ట్ చేయడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కలవరం చెలరేగింది. అసలు ఏంటి ఈ లిక్కర్ స్కామ్? ఢిల్లీలో తీగ లాగితే తెలంగాణలో ఎలా డొంక కదిలింది? హైదరాబాద్, గోవా, ఢిల్లీ.. ఇలా అల్లిబిల్లిగా అల్లుకున్న ఈ లిక్కర్ కుంభకోణం పుట్ట ఎలా బద్దలైంది? ఈ కేసులో కవిత పాత్రపై దర్యాప్తు సంస్థలు ఏం చెబుతున్నాయి?

### మనీ లాండరింగ్ కేసుతో వేడ్డి పెంచిన ఈడీ

ఆ తర్వాత అసలు రాజకీయం, విచారణలు, అరెస్టుల పర్వం మొదలైంది. 2022 ఆగస్టు 17న ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా సహా 15 మందిపై అభియోగాలు మోపుతూ సీబీఐ కేసు నమోదు చేసింది. ఆగస్టు 19న, ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా నివాసంలో సీబీఐ సోదాలు చేపట్టింది. ఆ మరుసటి రోజే ఈ కేసులోకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఎంటరైంది. ఆ తర్వాత ఈ కేసులో దూకుడు పెరిగింది. %జదీ×% ఛార్జ్‌షీట్ ఆధారంగా ఈడీ.. మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. సెప్టెంబర్ 27, 2022న ఈ లిక్కర్ స్కామ్‌లో మొదటి అరెస్టు జరిగింది. ఆమ్ ఆద్మీ పార్టీ సోషల్ మీడియా వ్యవహారాలు చూసే విజయ్ నాయర్‌ను %జదీ×% అరెస్టు చేసింది.

### కవిత ఆర్థిక సలహాదారు బుచ్చిబాబుపై ఆరోపణలు

ఈ కేసు విచారణలో భాగంగా అక్టోబర్ 7, 2022న ఢిల్లీ, తెలంగాణ సహా దేశంలోని 35 ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు నిర్వహించారు. 2022, అక్టోబర్ 17న ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాను సీబీఐ ఎనిమిది గంటలు ప్రశ్నించింది. నవంబర్ 25, 2022న ఏడుగురిపై సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన చార్టెడ్ అకౌంటెంట్ గోరంట్ల బుచ్చిబాబును 2023, ఫిబ్రవరి 8న సీబీఐ అరెస్టు చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఆర్థికపరమైన వ్యవహారాల్లో బుచ్చిబాబు సలహాదారుగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక 2023, ఫిబ్రవరి 26న విచారణకు హాజరైన సిసోడియాను సీబీఐ అరెస్టు చేసింది.

### వంద కోట్ల ముడుపులు చెల్లించిన సౌత్ గ్రూప్

మద్యం పాలసీ రూపకల్పనలో ప్రైవేటు వ్యక్తులు పాలు పంచుకున్నారని తేలింది. ఈ కేసులో అరెస్టయిన అమిత్ అరోరా రిమాండ్ రిపోర్టులో మూడుసార్లు ఎమ్మెల్సీ కవిత పేరు ప్రస్తావించింది సీబీఐ. ఈ స్కామ్‌లో ఢిల్లీ నేతలకు ముడుపులుగా వంద కోట్ల రూపాయలను సౌత్ గ్రూప్ చెల్లించిందని దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. సౌత్ గ్రూప్‌ను నియంత్రించింది శరత్‌చంద్రా రెడ్డి, కవిత, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి అని ఈడీ పేర్కొంది. సౌత్ గ్రూప్ ద్వారా వంద కోట్లను విజయ్ నాయర్‌కు చేర్చారని ఈడీ వెల్లడించింది. ఈ విజయ్ నాయర్.. ఓన్లీ మచ్ లౌడర్ సంస్థ మాజీ సీఈఓ. మనీష్ సిసోడియాకు ఈయన సన్నిహితుడు. ఈ కేసులో ఆధారాలు దొరక్కుండా ఉండేందుకు 36 మంది నిందితులు రూ.1.38 కోట్ల విలువైన 170 మ్యొబైల్ ఫోన్లు ధ్వంసం చేశారని ఈడీ తెలిపింది. వీటిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత రెండు నెంబర్లు, పది మ్యొబైల్ ఫోన్లను వాడినట్లుగా రిమాండ్ రిపోర్టులో దర్యాప్తు సంస్థ పేర్కొంది.

### కవితను విచారించిన సీబీఐ, ఈడీ

సౌత్ గ్రూప్ నుంచి ముడుపులు చెల్లించిన వారిలో.. అరబిందో డైరెక్టర్ శరత్‌చంద్రా రెడ్డితో పాటు కవిత పేరును%ౖౌ%అమిత్ అరోరా రిమాండ్ రిపోర్టులో ఈడీ పేర్కొంది. ఆ తర్వాత శరత్ చంద్రారెడ్డి అరెస్ట్ అవడం, విడుదల కావడం జరిగింది. ఆ తర్వాత ఇదే కేసులో కవిత ఇంటికి వచ్చి సీబీఐ విచారణ జరిపింది. తర్వాత ఆమెను ఢిల్లీలో ఈడీ రెండు సార్లు విచారించింది. ఇదే కేసుకు సంబంధించి అప్పట్లో ఢిల్లీ డిప్యూటీ సీఎంగా పనిచేసిన మనీష్ సిసోడియా కూడా అరెస్టయ్యారు. ఈ కేసులో పలువురు నేతలు, వ్యాపారులు, దళారులు అరెస్టయ్యారు. తాజాగా ఇదే కేసుకు సంబంధించి పలుమార్లు ఈడీ విచారణకు పిలిచినా, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ విచారణకు హాజరు కాలేదుఈ లిక్కర్ స్కామ్%ౖౌ%దేశ రాజధాని ఢిల్లీ నుంచి తెలంగాణ దాకా రాజకీయాలను అతలాకుతలం చేస్తోంది. నేతలకు కునుకు లేకుండా చేస్తోంది.

## సీఎం రేవంత్‌ను కలిసిన వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్

**టీ మీడియా, మార్చి 15, వరంగల్ :** బీఆర్ఎస్ ఎంపీ పసునూరి దయాకర్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుసుకున్నారు. వరంగల్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న పసునూరి, బీఆర్ఎస్‌కు మరో ఎంపీ షాక్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. వరంగల్ బీఆర్ఎస్ ఎంపీ పసునూరి దయాకర్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుసుకున్నారు. వరంగల్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న పసునూరి, మరోసారి అదే సీటును ఆశించి భంగపడ్డారు. తిరిగి పోటీ చేయాలని విశ్వ ప్రయత్నం చేసినా ఫలించలేదు. ఇటీవల వరంగల్ నేతలతో సమీక్ష నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్.. ఎంపీ సీటును కడియం శ్రీహరి కూతురు కడియం కావ్యకు కేటాయించారు.తనకు మరోసారి వరంగల్ ఎంపీగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరినప్పటికీ అధిష్టానం పట్టించుకోకపోవడంపై పసునూరి దయాకర్ అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా మంత్రి కొండా సురేఖతో కలిసి సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. దీంతో ఆయన బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం దాదాపు ఖాయమనే చర్చ జరుగుతోంది.

## అదుపులోకి తీసుకున్న ఈడీ
## వారెంట్ లేకుండా ఎలా అరెస్టు చేస్తారు : కేటీ రామారావు

**టీ మీడియా, మార్చి 15,హైదరాబాద్ :** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎమ్మెల్సీ కవితకు అరెస్ట్ నోటీసులు ఇచ్చారు ఈడీ అధికారులు. హైదరాబాద్‌లో కవిత ఇంట్లికి చేరుకున్న ఈడీ అధికారులు, సెర్చ్ వారెంట్ తోపాటు అరెస్ట్ వారెంట్‌ను కవితకు అందించారు. కవిత ఇంట్లో గంటల తరబడి సోదాలు నిర్వహించారు. అనంతరం కవితను అదుపులోకి తీసుకున్నారు ఈడీ అధికారులు.బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో ఈడీ అధికారులతో కలిసి ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఢిల్లీ నుంచి వచ్చిన 12 మంది అధికారుల బృందం 4 టీంలుగా ఏర్పడి తనిఖీలు చేసినట్లు సమాచారం. ఇద్దరు మహిళా అధికారులతో సహా 10 మంది అధికారులు సోదాల్లో పాల్గొన్నారు. కవితతో పాటు ఆమె భర్త వ్యాపారాలపై నా ఈడీ అధికారులు ఆరా తీసినట్లు

# లిక్కర్ స్కామ్‌లో ఎమ్మెల్సీ కవిత అరెస్ట్

తెలుస్తోంది. ఇంట్లోకి ఎవరినీ అనుమతించడం లేదు. ఈ క్రమంలో కవిత రెండు ఫోన్లను అధికారులు సీజ్ చేశారు. ఆమె స్టేట్ మెంట్ ను రికార్డు చేసినట్లు సమాచారం.ఢిల్లీ లిక్కర్ కేసులో ఏడాది గ్యాప్ తర్వాత ఎమ్మెల్సీ కవితకు ఫిబ్రవరి నెలలో సీబీఐ నోటీసులు ఇచ్చింది. 2022 డిసెంబర్‌లో కవిత నివాసంలోనే స్టేటిమెంట్ తీసుకున్న సీబీఐ.. గత ఫిబ్రవరి 26న ఢిల్లీకి రావాలని, తమ ఎదుట విచారణకు రావాలంటూ నోటీసులు ఇచ్చింది. ఈ కేసులో కవితను నిందితురాలిగా చేర్చి 41-%ౖౌ% కింద నోటీసులు ఇచ్చింది సీబీఐ. లిక్కర్ కేసులో కీలక నిందితులు అప్రూవర్లుగా మారడంతో.. వారి స్టేట్మెంట్స్ ఆధారంగా కవితకు నోటీసులు జారీ చేసింది సీబీఐ. ఇదే కేసులో ఇప్పటికే కవితను ఈడీ కూడా విచారించింది.ఈడీ సోదాలపై కవిత లాయర్ సోమా భరత్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసులో సుప్రీంకోర్టు తీర్పు వచ్చే వరకు ఎలాంటి చర్యలు ఉండవన్న ఈడీ.. సోదాలు చేయడం సరికాదన్నారు. కోర్టులో కేసు ఉండగా సడెన్‌గా ఎందుకీ సోదాలని ఆయన ప్రశ్నించారు. మరోవైపు బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున కవిత ఇంటికి చేరుకుంటున్నారు. ఈడీ దాడులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణుల ధర్నాకు దిగారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.2022 జులైలో ఢిల్లీ లిక్కర్ స్కామ్ వెలుగులోకి వచ్చింది. దాదాపు 5 నెలల తర్వాత మొదటిసారిగా 2022 డిసెంబర్ 11న కవితను ఇంట్లోనే విచారించిందిలిక్కర్ స్కామ్‌లో సి.ఆర్.పి.సి 160 కింద 7 గంటల పాటు ప్రశ్నించారు సీబీఐ అధికారులు. ఢిల్లీ లిక్కర్ స్కాంకు సంబంధించి సౌత్ గ్రూప్‌కు కవిత నేతృత్వం వహించారనేది ప్రధాన ఆరోపణ.2022 మార్చి 11న మొదటిసారిగా ఈడీ విచారణకు హాజరైయ్యారు కవిత. ఆ తర్వాత 16, 20, 21 తేదీల్లో కూడా ఢిల్లీలో కవితను విచారించారు ఈడీ అధికారులు. ఆ సమయంలోనే తన 8 ఫోన్లను ఈడీ అధికారులకు అందజేశారు కవిత. ఆ తర్వాత ఛార్జ్‌షీట్‌లో కవిత పేరును ప్రస్తావించింది ఈడీ, సీబీఐ. ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ 50 కింద ఈడీ స్టేటిమెంట్ రికార్డ్ చేసింది. జనవరి 5న కవితకు మళ్లీ ఈడీ నోటీసులు ఇచ్చింది.అయితే మహిళలను ఈడీ కార్యాలయానికి పిలిచి ప్రశ్నించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు కవిత. తనపై ఎలాంటి బలవంతపు చర్యలను ఈడీ తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో కవిత కోరారు. ఈ పిటిషన్‌ను ఇవాళ విచారించిన సుప్రీంకోర్టు ఈ నెల 19కి వాయిదా వేసింది.ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో గత నెల 21న సమన్లు జారీ చేసింది. గత నెల 26న వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో స్పష్టం చేసింది. ఈ కేసులో కవితను నిందితురాలిగా చేర్చి 41-%ౖౌ% కింద నోటీసులు ఇచ్చింది సీబీఐ. సుప్రీం కోర్టులో కేసు విచారణ ఉండగా.. తాను విచారణకు రాలేనని సీబీఐకి లేఖ రాశారు కవిత.ఇప్పటివరకు ఈ కేసులో దినేష్ అరోరా, గోరుంట్ల బుచ్చిబాబు, అరుణ్ రామచంద్ర పిళ్లై, మాగుంట రాఘవ అప్రూవర్లుగా మారారు. ఇదే కేసులో ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాను అరెస్ట్ ఈడీ చేసింది. పార్టీల స్పందన ఇదే..!

**ఎవరెవరూ ఎమన్నారంటే?**

గల్లీ నుంచి ఢిల్లీ దాకా లిక్కర్ స్కామ్ ప్రకంపనలు పుట్టిస్తోంది. ఢిల్లీ టు తెలంగాణ వరకు చాలామంది నేతల పీకకు ఈ కుంభ కోణం చుట్టుకుంది. తాజాగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఇంట్లో ఈడీ, ఐటీ ఏకకాలంలో సోదాలతో కలకలం రేగింది. ఆమెను ఈడీ అధికారులు అరెస్ట్ చేయడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కలవరం చెలరేగింది.

### కవిత అరెస్ట్‌పై పార్టీల స్పందన

గల్లీ నుంచి ఢిల్లీ దాకా లిక్కర్ స్కామ్ ప్రకంపనలు పుట్టిస్తోంది. ఢిల్లీ టు తెలంగాణ వరకు చాలామంది నేతల పీకకు ఈ కుంభకోణం చుట్టుకుంది. ఈడీ అధికారులు అరెస్ట్ చేయడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కలవరం చెలరేగింది. కవితకు సంబంధించిన కేసు అంశం సుప్రీంకోర్టులో ఉండగా ఆమెను అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి. అయితే కవిత విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతోందన్నారు బీజేపీ నేత ఈటల రాజేందర్. ఈ అంశానికి బీజేపీతో సంబంధం లేదన్నారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. మరికొన్ని గంటల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతున్న సమయంలో కవితను అరెస్ట్ చేయడంపై సందేహాలు వ్యక్తం చేశారు తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. ఇది మ్యాచ్ ఫిక్సింగ్ కావొచ్చన్నారు.కవిత అరెస్ట్‌ను ప్రశ్నించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు. ట్రాన్సిట్ వారెంట్ లేకుండా ఎలా అరెస్టు చేస్తారంటూ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌ను నిలదీశారు కేటీఆర్. అరెస్టు చేయమంటూ సుప్రీంకోర్టుకు మాట ఇచ్చిన తర్వాత ఇప్పుడు ఎలా అరెస్టు చేస్తారన్నారు కేటీఆర్. సుప్రీంకోర్టు లో చెప్పిన మాటను తప్పుతున్న అధికారులు కోర్టు ద్వారా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సోదాలు ముగిసిన తర్వాత కూడా ఇంట్లోకి రావద్దు అంటూ హుకుం జారీ చేస్తున్న ఐడీ అధికారుల పైన మండిపడ్డ కేటీఆర్.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. కవితను ఎప్పుడో అరెస్టు చేయాల్సి ఉందని, రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ ఎన్నికల ముందు కవితను అరెస్ట్ చేస్తోందని విమర్శించారు. ఇంతకాలం కవితలు ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. కవిత అరెస్టుతో ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో రాష్ట్రంలో మూడో నాలుగో స్థానాలను గెలవచ్చని బీజేపీ ఆశపడుతోందన్నారు. బీజేపీ %--% బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్ పాల్పడుతున్నాయని, గల్లీల కొట్లాట ఢిల్లీలో దోస్తీ అని కోమటిరెడ్డి ధ్వజమెత్తారు.చట్టానికి వ్యతిరేకంగా ఈడీ అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి. రాజకీయంగా బీఆర్ఎస్ అంతం చేయడానికి ప్రధాని మోదీ కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నేతలను భయభ్రాంతులకు గురి చేయాలని ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విరుచుకుపడ్డారు. ప్రజాక్షేత్రంలో రాజకీయంగానే బీజేపీని ఎదుర్కొంటామన్నారు ప్రశాంత్ రెడ్డి. చట్ట పరంగా న్యాయస్థానాల్లో పోరాడుతామన్నారు. ఎమ్మెల్సీ కవితకు బీఆర్ఎస్ పార్టీ, తెలంగాణ సమాజం అండగా ఉంటుందన్నారు మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి.

కవిత్ అరెస్ట్‌పై బీజేపీ నేతలు స్పందించారు. ఈడీ సోదాలతో భారతీయ జనతా పార్టీకి సంబంధం లేదన్నారు. చట్టం తన పని తాను చేసుకుంటూ వెళ్తుందన్నారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి. దేశాన్ని కుదిపేసిన లిక్కర్ స్కామ్‌లో ఎవరైనా అరెస్ట్ కాక తప్పదన్నారు. నేరం చేయనప్పుడు కవితకు భయమెందుకు? ఈడీ విచారణకు కవిత సహకరించాలన్నారు కిషన్ రెడ్డి. కవితపై ఈడీ రైడ్స్ ప్రభుత్వ కక్షపూరితం కాదన్నారు మాజీ మంత్రి ఈటెల రాజేందర్. విచారణ సంస్థలు పని.. అవి చేసుకుని పోతాయన్నారు. దేశంలో విచారణలు మెదటసారి జరగటం లేదన్న ఆయన, ఈడీ దగ్గరున్న ఆధారాలను బట్టి విచారణలు జరుపుతాయన్నారు. కక్ష సాధింపులకు దిగాల్సిన అవసరం బీజేపీకి లేదన్నారు.ఇన్నాళ్ళు ఈడీ విచారణకు సహకరించకుండా కవిత తప్పించుకుని తిరిగిందన్నారు ఎమ్మెల్యే రాజాసింగ్. ఇంతకాలం సహకరించలేదు కాబట్టే.. ఈడీనే ఆమె ఇంటికి వెళ్ళిందన్నారు. లిక్కర్ స్కామ్‌లో అరెస్ట్ అవుతానని కవితకు తెలుసన్నా రాజాసింగ్.. మోదీ సర్కార్‌లో తప్పు ఎవరు చేసిన శిక్ష తప్పదని రాజాసింగ్ స్పష్టం చేశారు. కక్ష సాధింపు చర్యలకు దిగాల్సిన అవసరం బీజేపీకి లేదన్నారు.

## అన్నా అని పిలిచినవాడే వివేకా హంతకులకు రక్షకుడు
## వైఎస్ షర్మిల

**టీ మీడియా, మార్చి 15, కడప :** అన్నా అని పిలిపించుకున్న వాడే హంతకులకు రక్షణ గా ఉన్నారంటూ జగన్ పై ఆయన సోదరి షర్మిల విరుచుకుపడ్డారు. సాక్ష్యాలు అన్నిబంధువులే హంతకులంటున్నా, నిందితులందరూ అన్న నీడలో క్షేమంగా ఉన్నారంటూ ఫైర్ అయ్యారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి అయిదో వర్ధంతి సందర్భంగా శుక్రవారం పులివెందులలోని వివేకా ఘాట్ వద్ద ఆయన కుమార్తె సునీత. షర్మిళ నివాళులర్పించారు..ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చిన్నాన్న వైఎస్ వివేకాను అత్యంత కిరాతకంగా హత్య చేసి ఐదేళ్లు గడుస్తోందని అన్నారు. బాబాయ్ శరీరంపై ఎన్నో గొడ్డలి పోట్లు ఉన్నాయని, దారుణంగా హతమార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. హత్య జరిగి ఐదేళ్లు పూర్తవుతున్నా ఇంత వరకు హంతకులకు శిక్ష పడలేదని అన్నారు. చిన్నాన్న మరణంతో చిన్నమ్మ, సునీత అందరి కంటే ఎక్కువ నష్టపోయారని చెప్పారు.

సునీతకు వేధింపులు న్యాయం కోసం పోరాడుతున్న సునీతను టార్గెట్ చేసి ఎంతో వేధించారని షర్మిల మండిపడ్డారు. బాధితులకు భరోసా ఇవ్వాలన్న ఆలోచన లేకపోగా వారిపైనే ఆరోపణలు చేస్తారా? అని ప్రశ్నించారు. అన్నా అని పిలిపించుకున్న వారే హంతకులను రక్షిస్తున్నారని విమర్శించారు. బంధువులే హత్య చేశారని అన్ని సాక్ష్యాలు వేలెత్తి చూపుతున్నాయని తెలిపారు. హత్య చేసిన వారికి, చేయించిన వారికి ఇంత వరకు శిక్షపడలేదని చెప్పారు. హత్యకు గురైన చివరి క్షణం వరకు బాబాయ్ వైసీపీ కోసమే పని చేశారని అన్నారు. జగనన్న ఇంతగా దిగజారుతాడని అనుకోలేదని చెప్పారు. సాక్షిలో పైన వైఎస్ ఫొటో ఉంటుందని కింద వైఎస్ తమ్ముడి వ్యక్తిత్వ హననం ఉంటుందని మండిపడ్డారు.

# బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు.. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి దోహదం

- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**టీ మీడియా, మార్చి 15, వనపర్తి బ్యూరో :**

బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు దోహదం చేస్తుందని బీఆర్ఎస్ నేత నిరంజన్ రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ స్థానాన్ని బీఎస్పీ అప్పగిస్తూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని సాగతిస్తున్నామని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి గెలుపుకోసం కలిసికట్టుగా కృషి చేస్తామని వెల్లడించారు. పార్టీ నేతలతో కలిసి శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన రుణమాఫీ హామీ అటకెక్కించిందని, రైతుభరోసా ఆగిపోయిందని చెప్పారు. మహిళలకు నెలకు రూ.2500, నిరుద్యోగులకు రూ.4 వేల భృతి పథకాల ఊసెత్తడం లేదని విమర్శించారు.కేసీఆర్ ప్రభుత్వం భర్తీ చేసిన 30 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు అందజేసి తామే ఇచ్చినట్టు కాంగ్రెస్ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పాలనలో సాగునీరు ఆగిపోయింది.. తాగునీటికి కరువు వచ్చిందని విమర్శించారు. పదేండ్లలో పచ్చబడ్డ పాలమూరు మళ్లీ బీడు భూములతో దర్శనమిస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కరెంటు కోతలతో రైతులు తల్లడితున్నారని చెప్పారు. అర్ధరాత్రి కరెంటు కోసం రైతులు నిద్రకాయాల్సిన దుస్థితిని కాంగ్రెస్ మళ్లీ తీసుకొచ్చిందని వెల్లడించారు. కాంగ్రెస్ తెచ్చిన ఈ మార్పులను ప్రజలకు వివరించాలన్నారు.

# ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకే పోలీసుల కవాతు

- ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి
- డిఎస్పి రవీంద్రనాథ్ రెడ్డి

**టీ మీడియా, మార్చి 15, మహానంది:**

ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని నంద్యాల డిఎస్పి రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మహానంది మండలంలోని సీతారామపురం, మసీదుపురం గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ.. నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున, ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు,ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా, శాంతిభద్రతలను కాపాడడానికి కేంద్ర సాయుధ బలగాల పోలీసులతో కవాతు నిర్వహించారన్నారు.ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికలలో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా దానికి పోలీసు యంత్రాంగం సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు. సీఐ శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో కక్షలు, గొడవలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున, ఎటువంటి అల్లర్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా, శాంతిభద్రతలను కాపాడడానికి కేంద్ర సాయుధ బలగాల పోలీసులతో కవాతు నిర్వహించారన్నారు. సమస్యలు ఏర్పడినప్పుడు వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో మహానంది ఎస్ నాగేంద్ర ప్రసాద్, కేంద్ర బలగాలు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు ఆరోపణలు చేస్తే పరువు నష్టం దావా వేస్తా

- క్లాస్ వన్ కాంట్రాక్టర్ జిల్లా సగర సంఘం అధ్యక్షులు తిరుపతయ్య సాగర్

**టీ మీడియా, మార్చి 15, వనపర్తి బ్యూరో :**

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణంలో డబ్బులు ఇచ్చామంటూ తప్పుడు ఆరోపణలు చేసి జిల్లా పోలీసు అధికారికి ఫిర్యాదు చేసిన వారిపై పరువు నష్టం దావా కేసు వేస్తాను అని వనపర్తి జిల్లా సగర సంగం అధ్యక్షులు తిరుపతయ్య సాగర్ అన్నారు. శుక్రవారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పలు జిల్లాల్లో క్లాస్ వన్ గ్రేడ్ కాంట్రాక్టర్ లైసెన్స్ కలిగి ఉన్న తిరుపతయ్య సాగర్ వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టేందుకు టెండర్ రావడం జరిగిందని చెప్పారు. 2022 సంవత్సరంలో రావడం జరిగింది. ఈ టెండర్ ఇండ్లకు సంబంధించినవి అన్నిటిని పురోగతిలో పెడుతూ ఉంటే కొందరు పడి రాక నాపై అక్రమ ఆగడాలకు తెర లేపారని ఆయన ఆరోపించారు. ఇండ్లలో అవకతవకలుంటే ప్రశ్నించాలి కానీ నిజాలు తెలుసుకోకుండా నాపై జిల్లా ఎస్పీకి పిర్యాదు చేయడం సరికాదన్నారు. 20 ఇండ్లకు నిర్మాణానికి గాను ఒక కోటి 80 వేల రూపాయలు వ్యయంతో టెండర్ రావడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 75 లక్షలు పెట్టి కట్టడం జరిగిందని కానీ ఇండ్ల పైన ప్రభుత్వపరంగా ఏ లబ్ధి జరగలేదని తెలిపారు. కానీ కొందరు వ్యక్తులు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ పత్రికలలో రెండు కోట్ల 80 లక్షల అవినీతి చేశారంటూ వార్తలు ప్రచురించడమే కాకుండా వనపర్తి జిల్లా పోలీస్ అధికారి ఫిర్యాదు చేశారు. ఇట్టి విషయంపై పోలీసు అధికారులకు వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చిందని పలు జిల్లాల్లో క్లాస్ వన్ గ్రేడ్ కాంట్రాక్టర్ లైసెన్స్ కలిగి ఉన్న తనపై తప్పుడు ఆరోపణలు చేసి తన వృత్తికి ఆటంకం కలిగించే మానసిక శోభకు గురిచేసిన వ్యక్తుల వారిపై పరువు నష్టం దావా కేసు వేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్య సలహాదారులు ఆర్బి ఆంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకా సత్యం సాగర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చీర్ల విష్ణు సాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సత్యనారాయణ సాగర్ , జిల్లా ఉపాధ్యక్షులు చీర్ల జనార్ధన్ సాగర్, మరికుంట చంద్రయుడు సాగర్, పెబ్బేరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి కోమటిరెడ్డి

**టీ మీడియా, మార్చి 15, నల్లగొండ :**

మంత్రి అయిన తర్వాత అభివృద్ధి పనులకు నేను పుట్టిన గ్రామానికి రావడం చాల సంతోషంగా ఉందని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. నార్కెట్‌పల్లి మండలం బ్రహ్మణ వెల్లంల గ్రామంలో శుక్రవారం నల్లగొండ నుంచి బ్రాహ్మణ వెల్లంల, బ్రాహ్మణ వెల్లంల నుంచి చిట్యాల వరకు నాలుగు లైన్ల రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వచ్చే ఏడాది వర్ష కాలం వచ్చేనాటికి బ్రహ్మణ వెల్లంల ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. అలాగే ఆరు నెలల్లో డబుల్ రోడ్డును పూర్తి చేస్తామని చెప్పారు. తాను పుట్టి పెరిగిన ఊరికి ఎంత చేసినా తక్కువే అన్నారు. ప్రతీక్ పేరు మీద లైబ్రరీ నిర్మాణం చేసుకుందామని చెప్పారు. గ్రామాన్ని సోలార్ గ్రామం ప్రాజెక్టుగా ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల వీరేశం, తదితరులు ఉన్నారు.

## దేశంలోనే అతిపెద్ద కుంభకోణం : సంజయ్ రౌత్

**టీ మీడియా, మార్చి 15, ముంబై :**

ఎలక్టోరల్ బాండ్ల వల్ల బిజెపి కోట్లాది రూపాయల్ని వెనుకేసుకుందని, ఇది దేశంలోనే అతి పెద్ద కుంభకోణం అని శివసేన (యుబిటి) నేత సంజరు రౌత్ తీవ్రంగా విమర్శించారు. ఎలక్టోరల్ బాండ్ల విషయంపై సంజరురౌత్ శుక్రవారం మాట్లాడుతూ.. 'గేమింగ్ అండ్ గ్యాంబ్లింగ్ కంపెనీలు ఎలక్టోరల్ బాండ్‌లను కొనుగోలు చేస్తాయి. ఆ నిధులను నేరుగా బిజెపి ఖాతాల్లోకి పంపిస్తాయి. మేఘా ఇంజనీరింగ్ కంపెనీ అనేక కాంట్రాక్టులను పొందిన ఫలితంగా లక్షల ఎలక్టోరల్ బాండ్‌లను కొనుగోలు చేసింది. ఈ నిధులను నేరుగా బిజెపి బ్యాంకు ఖాతాలోకి జమ చేస్తోంది. ఎలక్టోరల్ బాండ్లలో డబ్బును కొనుగోలు చేసి రాజీకయ పార్టీలకు బదిలీ చేసిన ఇలాంటి కంపెనీలు చాలా ఉన్నాయి. ఇది దేశంలోనే అతిపెద్ద కుంభకోణం' అని సంజరురౌత్ బిజెపిపై తీవ్రంగా ఆరోపించారు.

## కట్టుకున్న భర్తను హత్య చేసిన భార్య

**టీ మీడియా, మార్చి 15, వనపర్తి బ్యూరో :**

మూసాపేట మండలం వేముల గ్రామానికి చెందిన సాయన్న మిస్సింగ్ కేసును పోలీసులు చేదించారు. చిన్న చింతకుంట మండలం కురుమూర్తి గ్రామానికి చెందిన శివమ్మతో సాయన్నకు వివాహం జరిగింది. ఇద్దరి మధ్య గొడవ జరగడంతో శివమ్మ పుట్టింటికి వచ్చింది. ఎలాగైనా సాయన్నను వదిలించుకోవాలని తండ్రితో కలిసి సాయన్నను హతమార్చారు. శవాన్ని ఊక చెట్టు వాగులో పాతిపెట్టినట్లు పోలీసులకు శివమ్మ పై అనుమానంతో తమదైన శైలి లో విచారించగా సాయన్నను మీమే హతమార్చామని పోలీసులకు దగ్గర ఒప్పుకున్నారు.

## గంగపుత్ర కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం

**టీ మీడియా, మార్చి 15, వనపర్తి బ్యూరో :**

వనపర్తి జిల్లా ఖిల్లా ఘణపురం మండలంలో గంగపుత్ర కార్పొరేషన్ ఏర్పాటు చేసిన శుభసందర్భంగా జిల్లా మత్స్యశాఖ ఉపాధ్యక్షులు గాండ్ల నరేందర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి మన రాష్ట్ర ప్రణాళిక సంఘ ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి కి ఎమ్మెల్యే మెగా రెడ్డికి గంగపుత్ర కార్పొరేషన్ ఏర్పాటు కోసం కృషి చేసినటువంటి కాంగ్రెస్ ఫిషర్మెన్ అధ్యక్షుడు మెట్టు సాయికుమార్ కి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గంగపుత్ర కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు గాండ్ల నరేందర్ టౌన్ ప్రెసిడెంట్, బీసీ నారాయణ ,మాజీ ఎంపీటీసీ గుగ్గిల గోపాల్, గుగ్గిల బాలస్వామి, గాండ్ల యాదయ్య, గాండ్ల శ్రీనివాసులు, సూరి, గాండ్ల వెంకటయ్య, చెన్నయ్య, గుగ్గిల ఆంజనేయులు, కార్యకర్తలు మరియు గంగపుత్ర సోదరులు పాల్గొనడం జరిగింది.

## ఘనంగా కాన్షిరాం జయంతి వేడుకలు

**టీ మీడియా, మార్చి 15, వనపర్తి బ్యూరో :**

బహుజనులకు రాజ్యాధికారమే అంతిమ లక్ష్యమని గ్రహించి బహుజన్ సమాజ్ పార్టీ నీ స్థాపించి బహుజనలకు రాజ్యాధికారం, చట్టసభల్లోకి వెళ్లడానికి మార్గ నిర్దేశం చేసిన రాజకీయ దురంధరుడు మన్యశ్రీ కాన్షిరాం 90 వ జయంతి సందర్భంగా వారి ఫోటోకు పూలమాల వేసి చలో నాగర్ కర్నూల్ ఈ కార్యక్రమంలో భాగంగా కాన్సిరాం జయంతి సభకు బయలుదేరిన వనపర్తి పట్టణ నాయకులు ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ అధ్యక్షులు కేశపాగ గౌతమ్, గంధంశివ, ద్యారపోగు కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోని ప్రతి మహిళకు కాంగ్రెస్ పార్టీ 7500 బాకీ పడింది

- ఎమ్మెల్యే హరీశ్‌రావు

**టీ మీడియా, మార్చి 15, హైదరాబాద్ :**

రాష్ట్రంలోని ప్రతి మహిళకు కాంగ్రెస్ ప్రభుత్వం7500 రూపాయలు బాకీ పడిందని హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రంలో 18 ఏండ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.2500 ఇచ్చి మహాలక్ష్ములను చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు తమ మ్యానిఫెస్టోలో పెట్టిందని ఆయన గుర్తు చేశారు. ఇవాళ మహాలక్ష్మీ పథకం మహా మోసంగా మారిందని విమర్శించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన హరీశ్‌రావు.. కాంగ్రెస్ వంద రోజుల పాలనలో చేసిన మోసాలను నిలదీశారు.ఇవాల్టికి కాంగ్రెస్ పాలన వచ్చి 100 రోజులు పూర్తయ్యింది.. అంటే మూడు నెలలు నిండి నాలుగు నెలలు నడుస్తున్నాయి. అంటే మూడు నెలలకు లెక్కేసుకున్నా.. ఈ రాష్ట్రంలో ప్రతి మహిళకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.7500 బకాయి పడింది' అని హరీశ్‌రావు అన్నారు. బకాయి పడ్డ 7500 రూపాయలను మా అక్కాచెల్లెళ్లకు చెల్లించిన తర్వాతనే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగాలని మండిపడ్డారు. ఏ మొహం పెట్టుకుని ఓటు అడుగుతారని ప్రశ్నించారు. ఈ రాష్ట్రంలో 90 లక్షల మంది తెల్ల రేషన్ కార్డుదారులు ఉన్నారని.. కనీసం వారికి ఇచ్చినా కూడా దాదాపు ఈ మూడు నెలల్లో 7500 కోట్లు మహిళలకు చేరేవని అన్నారు. అంటే ఈ రాష్ట్రంలో అక్కాచెల్లెళ్లకు రూ.7500 కోట్లు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని తెలిపారు.

# సిసి రోడ్డుకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే వివేక్ వెంకట్ స్వామి

- ఏడవ వార్డులో 73 లక్షలతో రోడ్లు, డ్రైనేజీలు, మూడవ వార్డులో సీసీ రోడ్డుకు భూమి పూజ

**టీ మీడియా, మార్చి 15, రామకృష్ణాపూర్ :**

క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లోని ఏడవ వార్డు కౌన్సిలర్ పొలం సత్యం,మూడో వార్డు కౌన్సిలర్ కొక్కుల స్రవంతి, సత్యనారాయణ ల ఆధ్వర్యంలో ముఖ్య అతిథులు ఎమ్మెల్యే వివేక్ వెంకట్ స్వామి శుక్రవారం పాల్గొని సాయి కుటీర్ కాలనీ అలాగే బి జూన్ పోచమ్మ గుడి సమీపంలో సీసీ రోడ్లకు భూమి పూజ చేసి కొబ్బరికాయలు కొట్టి రోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గద్దెరాగడి సాయి కుటీర్ కాలనీకి స్పెషల్ డెవలప్ మెంట్ ఫండ్ కింద పద్దెనిమిది లక్షల ఎనిమిది వేలు,బి జూన్ పోచమ్మ బస్తి సిసి రోడ్డుకు లక్ష రూపాయలు జనరల్ ఫండ్ తో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పుర చైర్మన్,వైస్ చైర్మన్ జంగం కళ,విద్యాసాగర్ రెడ్డి, కమిషనర్ మురళీకృష్ణ, పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపతి రాజయ్య,వొడ్నాల శ్రీనివాస్,అబ్దుల్ అజీజ్, మహంకాళి శ్రీనివాస్, ఆకుల రాజన్న, కలిగిరి కనకరాజు, సీనియర్ నాయకులు,మహిళా నాయకురాళ్ళు,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# లక్కారం శ్రీ వెంకటేశ్వర ఆలయ కమిటీ ఏర్పాటు

- ప్రమాణ స్వీకారానికి హాజరై శుభాకాంక్షలు తెల్పిన నీలం మధు

**టీ మీడియా, మార్చి 15, పటాన్ చెరువు :**

పటాన్ చెరువు మండలం లక్కారం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ దేవస్థానానికి నూతన కమిటీని ఏర్పాటు చేశారు.ఆలయ కమిటీ అధ్యక్షుడిగా గోపాల్ రెడ్డి,డైరెక్టర్ గా లక్ష్మారెడ్డి ఎంపికయ్యారు.నూతనంగా ఏర్పాటైన కమిటీ ప్రమాణ స్వీకారానికి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులందరికీ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కొత్త ఆలయ కమిటీ చొరవ తీసుకుని చుట్టుపక్కల గ్రామాలలో ప్రఖ్యాతి గాంచిన లక్కారం వెంకటేశ్వర స్వామి ఆలయ దేవస్థానాన్ని మరింతగా అభివృద్ధి చేయాలన్నారు. భవిష్యత్తులో ఈ ఆలయ అభివృద్ధికి కావలసిన నిధుల విషయంలో తాను సంపూర్ణ సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సభ్యులు డాకయ్యసాగర్, రవిందర్ గౌడ్,గంగమ్మ, ఎంపీటీసీ శ్రీనివాస్, మాజి సర్పంచ్ రాజీరెడ్డి,మల్లారెడ్డి, శివనందం, ప్రభు,రామచంద్ర రెడ్డి,అశోక్, ముత్యాల రవీందర్ గౌడ్, మహేందర్ రెడ్డి,నర్సింహా గౌడ్, మల్లేశం గౌడ్,రఘుపతి రెడ్డి, స్థానిక నాయకులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ టెట్-2024 నోటిఫికేషన్ విడుదల..

**టీ మీడియా, మార్చి 15, హైదరాబాద్ :**

తెలంగాణ టెట్-2024 నోటిఫికేషన్ విడుదలయింది. మెగా డీఎస్‌సీకి ముందే టెట్ నిర్వహణకు ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో విద్యాశాఖ గురువారం (మార్చి 14న) టెట్-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. మార్చి 27వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 10వ తేదీ వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మే 20 నుంచి జూన్ 3వ తారీఖు వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు ఉంటాయని విద్యాశాఖ వెల్లడించింది. ఇతర పూర్తి సమాచారం కోరకు అధికారిక వెబ్‌సైట్ %ర్వ్.ఎస్స్స్.స్శీజ.అఅ% లో చూడాలని తెలిపింది. కాగా, టెట్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిన కొద్దిసేపటికే టెట్-2024 నోటిఫికేషన్ విడుదల కావడం విశేషం. కాగా, 2023 సెప్టెంబరులో నిర్వహించిన టెట్ పేపర్-1 పరీక్షలో 82,489 మంది (36.89 శాతం) మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ఇక పేపర్-2లో 29,073 మంది (15.30 శాతం) మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.తెలంగాణ మెగా డీఎస్‌సీ దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. మార్చి 4వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. మొత్తం 11,062 పోస్టుల భర్తీకి తెలంగాణ ప్రభుత్వం ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

## దొరికిన మొబైల్ ఫోన్‌ను పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన విద్యార్థి

- అభినందించిన ధర్మారం ఎస్ఐ టి.సత్యనారాయణ

**టీ మీడియా, మార్చి 15, ధర్మారం :**

మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ లో డి శివకుమార్ 8వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల కుటుంబ సభ్యులతో మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని పెద్దయ్య గుడి దేవుడి దర్శనం కోసం వెళ్లగా గుడి వద్ద విద్యార్థికి మొబైల్ ఫోన్ దొరికింది, కానీ అక్కడ ఎవరు కూడ ఫోన్ గురించి అడగలేదు అని అక్కడ నుండి విద్యార్థి శివకుమార్ తిరుగు ప్రయాణం చేసి స్వంత ఊరూ అయినా ధర్మారం వచ్చి పోలీస్ స్టేషన్ లో తనకు దొరికిన ఫోన్ ఎస్ఐ టి.సత్యనారాయణకు శుక్రవారం అప్పగించాడు. పోలీసులు మొబైల్ ఫోన్ లో వున్నా ఫోన్ నెంబర్ ల ఆధారంగా పోగొట్టుకున్న మోతే గ్రామానికి చెందిన దయ్యాల లింగయ్యకు సమాచారం అందించి ఫోన్ అందజేశారు.అనంతరం విద్యార్థి శివకుమార్ ను ఎస్సై, అభినందించారు.

## మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో "స్వీప్" కార్యక్రమం

**టీ మీడియా, మార్చి 15, గోదావరిఖని :**

రామగుండం మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో అశోక్ నగర్ లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం "స్వీప్" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తమ తల్లిదండ్రులు ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రతి విద్యార్థి చైతన్య పరచాలని ఆయన విద్యార్థులను కోరారు. ఓటు హక్కు వినియోగించుకుంటానని ప్రతిజ్ఞ చేయడానికి ఉద్దేశించిన సంకల్ప పత్రాలు తమ తల్లిదండ్రుల సంతకాలతో ప్రతి విద్యార్థి తీసుకురావాలని సూచించారు. మత, జాతి, కుల, వర్గ, భాష తదితర వేరే పనులకు ఇతర ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా నిష్పాక్ష పాతంగా నిజాయితీగా ఓటు వేయాలని ఓటు హక్కు ఉన్న తమ కుటుంబ సభ్యులకు సూచించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## కత్తెపల్లి గ్రామానికి శ్రీశైల జగద్గురు

**టీ మీడియా, మార్చి 15, వనపర్తి బ్యూరో :**

ఆత్మకూర్ మండల కేంద్రంలో కత్తెపల్లి గ్రామంలో శ్రీ వీరభద్ర స్వామి దేవాలయం కి ముఖ్య అతిథులు శ్రీశైల జగద్గురు శ్రీ శ్రీ చెన్న సిద్ధ రామ పండితారాధ్య శివాచార్య 1008 జగద్గురు గారు కత్తెపల్లి గ్రామానికి రాబోతున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి, మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే జీ .మధుసూదన్ రెడ్డి హాజరుకానున్నారని కాంగ్రెస్ మండల్ నాయకులు ఎండి. రహమతుల్లా తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మైనార్టీ యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, సేవాదళ్ నాయకులు భక్తులందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరారు.

## డాక్టరేట్ పొందిన ఖని నాగండ్ల రవికుమార్



**టీ మీడియా, మార్చి 15, గోదావరిఖని :**

గోదావరిఖని సప్తగిరి కాలనీలోని కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల చైర్మన్ నాగండ్ల రవికుమార్ కు అరుదైన అవకాశం డాక్టరేట్ పొందానని ఆయన తెలిపారు. ఆయన చదువుకున్న స్థాయి నుంచి చదువు చెప్పే స్థాయికి వెళ్లి ఎంతోమంది విద్యార్థులకు విద్యా బోధనలు అందించడంతో పాటు పలు రంగాల్లో రాణించినందుకుగాను ఆయన డాక్టరేట్ పట్టా పొందారు. సామాజిక సేవలో నేనున్నానంటూ ముందుకు వస్తూ, ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరిని ఆదరించి తోచినంత సహాయం చేసేవారు. నిరుపేదల విద్యార్థులకు తక్కువ ఖర్చుతో ప్రవేశాలు, నిరుపేదలకు సహాయ సహకారాలు అందించడంలో ఆయన దిట్ట.. సామాజిక సేవ ఆపన్న హస్తం, విద్యాబుద్ధులు దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్ హెలీ స్పిరిట్ క్రిస్టియన్ యూనివర్సిటీ ఫౌండర్ అండ్ చైర్మన్ బిషప్ డాక్టర్ ఆనంద్ కుమార్, యూనివర్సిటీ ప్రొఫెసర్లు మమత,అబ్రహంలు ఆయనకు డాక్టరేట్ పట్టాను అందజేశారు. మరింత సామాజిక సేవలో పాల్గొని ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని అన్నారు. కళాశాల చైర్మన్ నాగండ్ల రవికుమార్ డాక్టరేట్ పొందడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతి, అధ్యాపక బృందం శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.

### నుదుటిపై మూడు కుట్లు..

# నిలకడగానే దీదీ ఆరోగ్యం

**అధికారులు**

**టీ మీడియా, మార్చి 15, కోల్‌కత్తా :**

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఆసుపత్రిపాలైన విషయం తెలిసిందే. 69 ఏండ్ల దీదీ గురువారం సాయంత్రం తన ఇంట్లో పడిపోవడంతో ఆమె నుదుటిపై పెద్ద గాయం అయ్యింది. దీంతో ఆమెను హుటాహుటిన ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే సీఎం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు రాష్ట్ర పరిపాలన సీనియర్ అధికారి శుక్రవారం తెలిపారు. 'సీఎం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. సీనియర్ వైద్యులు ఆమెను నిశితంగా గమనిస్తున్నారు. రాత్రి కూడా ఆమె బాగానే నిద్రపోయారు' అని సదరు అధికారి మీడియాకు వెల్లడించారు. నుదుటిపై మూడు కుట్లు, ముక్కుపై ఒక కుట్టు వేసినట్లు తెలిపారు. ఆసుపత్రిలో అవసరమైన వైద్య పరీక్షల అనంతరం డిశ్చార్జ్ అయినట్లు తెలిపారు. దీదీ గురువారం సాయంత్రం ఒక కార్యక్రమానికి హాజరై తన ఇంటికి వచ్చారు. ఇంట్లో పడిపోవటంతో ఆమె నుదుటిపై పెద్ద గాయం అయ్యిందని, ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ వెంటనే దవాఖానకు తరలించిన ట్లు టీఎంసీ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు రక్తం వస్తున్న ఫొటోలను పోస్ట్ చేశారు. దీదీ ప్రస్తుతం కోల్‌కతాలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

# రాజకీయ పునరావాస కేంద్రంగా ఏపీపీఎస్సీ మారిపోయింది

**టిడిపి అధినేత చంద్రబాబు**

**టీ మీడియా, మార్చి 15, గుంటూరు :**



రాజకీయ పునరావాస కేంద్రంగా ఏపీపీఎస్సీ మారిపోయిందని, సమర్థ ఛైర్మన్ లేకపోతే ఏపీపీఎస్సీ బోర్డు అంతా సర్వనాశనమవుతుందని టిడిపి అధినేత చంద్రబాబు అన్నారు. ఏపీపీఎస్సీ అక్రమాలపై చంద్రబాబు మంగళగిరిలో శుక్రవారం ఉదయం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి ఆశ ప్రజాసేవ అని అన్నారు. ప్రజలకు సేవలందించాలని కొంత మంది గ్రూప్ పరీక్షలకు వస్తారని అన్నారు. తమ హయాంలో నిజాయతీ గల వ్యక్తులను ఛైర్మన్‌గా నియమించామని చెప్పారు. ఇప్పుడు రాజకీయ పునరావాస కేంద్రంగా ఏపీపీఎస్సీ మారిపోయిందని ఆరోపించారు. రాష్ట్ర యువతను దుర్మార్గంగా దగా చేసి వారి ఆశలు చంపేశారని ధ్వజమెత్తారు. నిక్కచ్చిగా వ్యవహరించిన ఉదరుభాస్కర్‌ను మెడపట్టి బయటకు పంపారని%శా% జగన్‌కు అనుకూలంగా వ్యవహరించిన గౌతమ్ సవాంగ్‌ను నియమించారు అని చంద్రబాబు విమర్శించారు.

# వంద రోజులు పూర్తయ్యాయి.. ఆరు గ్యారెంటీలు ఎక్కడ.?

**బీజేపీ ఎంపీ బండి సంజయ్**

**టీ మీడియా, మార్చి 15, కరీంనగర్ :**

దయచేసి ఆలోచించాలని, అందరి గురించి మోడీ ఆలోచిస్తున్నారని, మీరు పువ్వు గుర్తుకి ఓటేసి నన్ను గెలిపిస్తే నేను వెళ్లి మోడీకి ఓటేస్తా అని బీజేపీ ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రజాహిత యాత్రలో భాగంగా ఇల్లంతకుంట మండలంలో పర్యటించిన బండి సంజయ్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామని ఇచ్చిన గడువు ఇయాల్టితో ముగిసిందని తెలిపారు. కానీ వాటిని అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. ఎన్నికల హామీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ దారుణంగా మోసం చేసింది. ఎందుకు అమలు చేయలేదో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పి తీరాలని బండి మండిపడ్డారు.

# సీఎం రేవంత్ రెడ్డి కాన్వాయ్ నెంబర్ ప్లేట్ ఛేంజ్

**టీ మీడియా, మార్చి 15,హైదరాబాద్ :**

తెలంగాణలో నేటి నుంచి వాహనాల నెంబర్ ప్లేట్లను టీజీ పేరుతో రిజిస్ట్రేషన్ చేయడం అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి కాన్వాయ్ కి సైతం అధికారులు నెంబర్ ప్లేట్లను మార్చారు. సెక్రటేరియట్ లో ముఖ్యమంత్రి వెహికిల్స్ కు టీఎస్ పేరుతో ఉన్న నెంబర్ ప్లేట్లను సెక్యూరిటీ సిబ్బంది తొలగించి వాటి స్థానంలో టీజీ పేరుతో ఉన్న నెంబర్ ప్లేట్లను బిగించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు, మనోభావాలకు భిన్నంగా టీఎస్ పేరుతో వాహనాల రిజిస్ట్రేషన్లకు శ్రీకారం చుట్టిందనే కారణంతో కాంగ్రెస్ ప్రభుత్వం టీఎస్ స్థానంలో టీజీ మార్చివేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రం నుంచి గెజిట్ నోటిఫికేషన్ నెంబర్లు రానున్నాయి. అయితే టీజీ సీరీస్ కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునే వాహనాలకు మాత్రమే తప్పనిసరి చేయగా పాత వాహనాలకు మాత్రం పాత నెంబర్లే కొనసాగనున్నాయి.

# కేటీఆర్ పై ఈడీ ఆఫీసర్ సీరియస్

**టీ మీడియా, మార్చి 15,హైదరాబాద్ :**

కవిత అరెస్ట్ తో బీఆర్ఎస్ పార్టీ, జాగృతి నేతలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. అరెస్ట్ అయిన విషయం తెలుసుకున్న కొద్ది సేపటికే బీఆర్ఎస్ నేతల, కార్యకర్తలు ఆమె ఇంటికి చేరుకున్నారు. కేటీఆర్, హరీష్ రావులు ఇంట్లోకి వెళ్లి కవిత అరెస్ట్ చట్టవిరుద్ధమని ఈడీ ఆఫీసర్లతో వాదించారు. ట్రాన్సిట్ వారెంట్ లేకుండా ఎలా అరెస్ట్ చేస్తారని కేటీఆర్ ఈడీ అధికారులను ప్రశ్నించారు. దీంతో కేటీఆర్, ఈడీ, ఐడీ జాయింట్ డైరెక్టర్ మీనా భాను ప్రియ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కవిత అరెస్ట్ విషయాన్ని ఆమె భర్త అనిల్ కు సమాచారం ఇచ్చామని ఈడీ అధికారులు తెలిపారు. బీఆర్ఎస్ నేతలపై %జుణ% ఆఫీసర్ మీనా భాను ప్రియ సీరియస్ అయ్యారు. అనుమతి లేకుండానే, సొదాలు జరుగున్న సమయంలో ఇంట్లోకి చొచ్చుకు వచ్చారని అగ్రహం వ్యక్తం చేశారు. బలవంతంగా లోనికి వచ్చారని కేటీఆర్ పై ఆమె సీరియస్ అయ్యారు. లీగల్ గా అన్నీ డాక్యుమెంట్స్ తీసుకొనే వచ్చామని ఈడీ ఆఫీసర్ చెప్పారు.

# ఈ దేశాన్ని, సంస్కృతిని, వారసత్వాన్ని డీఎంకే ద్వేషిస్తోంది

**ప్రధాని మోదీ**

**టీ మీడియా, మార్చి 15, కన్యాకుమారి:**

తమిళనాడులోని కన్యాకుమారిలో శుక్రవారం ప్రధాని మోదీ బహిరంగ సభలో ప్రసంగించారు. తమిళనాడు భవిష్యత్తుకు, సంస్కృతికి డీఎంకే శత్రువు అని, అయోధ్య ప్రాణ ప్రతిష్ట ఈవెంట్ ప్రసారాన్ని బ్యాన్ చేశారని ప్రధాని మోదీ ఆరోపించారు. ఈదేశాన్ని, సంస్కృతిని, వారసత్వాన్ని డీఎంకే ద్వేషిస్తోందని ప్రధాని అన్నారు. ఈ దేశాన్ని విభజించాలని చూసిన వారిని జమ్మూకశ్మీర్ ప్రజలు తిరస్కరించారని, తమిళనాడు ప్రజలు కూడా ఇదే తరహా తీర్పు ఇస్తారని భావిస్తున్నట్లు చెప్పారు. ప్రజలను లూటీ చేసేందుకు డీఎంకే, కాంగ్రెస్ అధికారరంలోకి రావాలని చూస్తున్నారని ఆరోపించారు. 2జీ స్కాంలో డీఎంకేనే అతిపెద్ద లబ్ధిదారు అని మోదీ విమర్శించారు. మహిళలను అవమానించడం, చీటింగ్ చేయడం డీఎంకే, కాంగ్రెస్‌కు అలవాటైందని, మాజీ సీఎం జయలలితతో డీఎంకే వర్కర్లు ఎలా ప్రవర్తించారో తమిళనాడు ప్రజలకు తెలుసు అన్నారు. బీజేపీ వైపు అభివృద్ధి కార్యక్రమాలు ఉన్నాయని, కానీ ఇండియా కూటమి వైపు స్కామ్‌లు ఉన్నాయన్నారు. ఇండియా కూటమి చేసిన వివిధ స్కామ్‌లను ప్రధాని మోదీ బయటపెట్టారు. ఆ జాబితా పెద్దగా ఉందన్నారు. కన్యాకుమారి జిల్లా అభివృద్ధి కోసం కేంద్రం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు.

# అక్రమాలు చేస్తే ఎవర్ని వదలము

- గత ప్రభుత్వాల వైఫల్యమే ఈ అక్రమాలకు కారణం
- మార్చి 2023 నాడే క్లోజర్ ఆర్డర్ వచ్చినా అధికారులు ఎందుకు దాచి పెట్టారు
- ఈ కుంభకోణంలో హరీష్ రావు వాట ఎంతనో చెప్పాలి
- మంత్రి దామోదర రాజనర్సింహ పై హరీష్ రావు అసత్య ఆరోపణలు తగవు
- కాట శ్రీనివాస్ గౌడ్



**టీ మీడియా, మార్చి 15, పటాన్చెరువు :**

పటాన్చెరువు నియోజకవర్గం లోకాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనపై , మంత్రి దామోదర రాజనర్సింహా పై మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ చేసిన మాటలపై పటాన్ చెరు నియోజకవర్గం ఇంచార్జీ కాట శ్రీనివాస్ గౌడ్ ప్రెస్ మీట్ నిర్వహించి తీవ్రంగా ఖండించారు. లక్డారం క్వారీ విషయంలో గూడెం మహిపాల్ రెడ్డి ప్రభుత్వానికి 30కోట్ల రాయల్టిని ఎగ్గొట్టారన్నారు. పరిమితికి మించి 10లక్షల క్యూబిక్ మీటర్ల మేరకు అక్రమంగా మైనింగ్ చేశారన్నారు. 300 కోట్ల రూపాయలు ప్రభుత్వానికి కట్టాల్సిన డబ్బు ఎగ్గొట్టారని చెప్పారు.

నాటి ప్రభుత్వాన్ని కూడా తప్పుదోవ పట్టించారన్నారు. మిగతా అక్రమ క్వారీలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటున్నారు వాటిల్లో మీకెంత వాటా ముట్టిందని ప్రశ్నించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్యే సోదరుడు అరాచకాలు అంతా ఇంతా కాదని, మాజీ మంత్రి హరీశ్ రావు కూడా గతంలో దొంగలకు సద్ది కట్టారన్నారు. చెరువులు,కుంటలు కబ్జా చేసి వందల కోట్ల రూపాయలు కొల్లగొట్టారని, గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చినా 10-3-23 నాడే క్లోజర్ ఆర్డర్ వచ్చినా అధికారులు దాచి పెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుందని, మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో ఈ వ్యవహారం చేశారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వేల కోట్ల రూపాయలు అవినీతి చేసి దాచుకున్నారన్నారు. హరీష్ రావుకు పటాన్ చెరు ను ఏటియం గా మార్చుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అవసరం లేదని, ఆయనను ఎవరు రమ్మన్నారని ప్రశ్నించారు. అక్రమ దందాలు కాపాడుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇదే మాజీ మంత్రి హరీశ్ రావు నన్ను గతంలో టీఆర్ఎస్ లోకి రావాలని ఒత్తిడికి గురిచేసి ఒప్పుకోకపోతే తనను సర్పంచ్ పదవి నుంచి తొలగించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నిస్వార్థంగా ప్రభుత్వం నడిపిస్తుంది. అవినీతిని ప్రోత్సహించేది లేదన్నారు. హరీశ్ రావు బాగోతాలు అందరికీ తెలుసని నియోజకవర్గంలో ఏ భూమి కబ్జా అయినా, ఎక్కడ అవినీతి జరిగినా వారి హస్తం ఉంటుందన్నారు. పటాన్ చెరు నియోజకవర్గం లో జరిగిన భారీ కుంభకోణాలలో హరీశ్ రావు వాటా ఎంతో చెప్పాలన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహపై హరీశ్ రావు అసంబద్ధ ప్రేలాపనలు తగదన్నారు.

# బీఆర్ఎస్ లో ఇక మిగిలేది నలుగురే

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**టీ మీడియా, మార్చి 15,హైదరాబాద్ :**

బీఆర్ఎస్ నాయకులు వరుసగా ఇతర పార్టీలలోకి వెళుతున్నారని%శా% ఆ పార్టీలో చివరకు మిగిలేది నలుగురు మాత్రమేనని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. తాము ఆహ్వానిస్తే నల్గొండ జెడ్పీ చైర్మన్ కూడా కాంగ్రెస్‌లోకి వస్తారన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ%శా% బీఆర్ఎస్ పార్టీ నుంచి రోజుకో నాయకుడు కాంగ్రెస్ లేదా బీజేపీలోకి వెళుతున్నారని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లోనే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కేసీఆర్ దిగిపోతే పీడ విరగడయిందని ప్రజలు అనుకున్నారని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక లోక్ సభ స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రూ.7 లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శించారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక కేసీఆర్ కుటుంబం బంగారం అయిందన్నారు. లోక్ సభ ఎన్నికల తర్వాత తన కొడుకు ప్రతీక్ పేరిట లైబ్రరీని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి ఒక్కో మహిళా సంఘానికి రూ.1 కోటి ఇస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ పాలనకు అన్ని వర్గాల నుంచి ప్రశంసలు వస్తున్నాయని%శా% దీనిని బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు.

# వైసిపికి రాజీనామా చేసిన కావలి మాజీ ఎమ్మెల్యే

**టీ మీడియా, మార్చి 15,కావలి:**

నెల్లూరు జిల్లాల్లో వైసిపికు మరో ఎదురు దెబ్బ తగిలింది. కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు శుక్రవారం మీడియా సమావేశంలో ప్రకటించారు. పదేళ్లుగా వైసిపిలో ఉంటే సరైన గుర్తింపు లేదని, హీనంగా చూశారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కావలి, ఉదయగిరి అభ్యర్థుల విజయానికి పనిచేశానని గుర్తు చేశారు. ఆత్మాభిమానం చంపుకొని ఉండలేకే రాజీనామా నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. అన్ని పార్టీల నుంచి ఆహ్వానాలు అందుతున్నాయని, ఏ పార్టీలో చేరేది త్వరలోనే ప్రకటిస్తానన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

**టీ మీడియా, మార్చి 15, గోదావరి ఖని :**

ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పరికిపండ్ల నరహరి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కండ్లు మందగించిన వారికి దేశాన్ని పరిచయం చేసేందుకు కంకణం కట్టుకున్న ఐఏఎస్ అధికారి నరహరి వారందరికీ ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేయించారు. దృష్టిలోపం ఉన్న 150 మందికి ఉచితంగా కంటి వైద్య ఆపరేషన్ చేయించారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక వైద్య బృందంతో అత్యాధునిక సాంకేతిక పరికరాలతో వందమందికి కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. హైదరాబాదులోని శంకర్ విజన్ సెంటర్ ఆపరేషన్ చేపట్టారు. దృష్టిలోపం ఉన్నవారికి రెండు రోజులపాటు ఉచిత భోజన వసతులతో పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంటూ తిరిగి గమ్యానికి చేర్చారు. అదేవిధంగా శనివారం కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కంటి సమస్యతో బాధపడుతున్న వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో ఆసుపత్రి బాధ్యులు పరికిపండ్ల రాము, పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్, ఆలయ ఫౌండేషన్ వాలంటీర్స్ మిట్టపల్లి రాజేందర్, కీర్తి నాగార్జున, కన్నం తిరుపతి, కన్నం వెంకటేష్, బండి శ్రీనివాస్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

# రూ. 1.48 కోట్ల విలువ గల నకిలీ ఆర్గానిక్ ఉత్పత్తులు స్వాధీనం

**టీ మీడియా, మార్చి 15, మేడి కొండూరు :**

విజిలెన్సు అండ్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారులకు రాబడి నవిశ్వసనీయమైన సమాచారముతో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ ఇనస్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు వారి ఆదేశముల మేరకు, గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారి శ్రీ కె.ఈశ్వర రావు ప్రత్యక్ష పర్యవేక్షణలో విజిలెన్స్ అధికారులు స్థానిక రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో కలసి, మేడికొండూరు మండలం, పేరేచెర్ల గ్రామం లోని "నికిత కిసాన్ సేవా కేంద్రం" లో తనిఖీ చేయగా, అక్కడ ఏ విధమైన ఇన్వాయిసులు, బిల్లులు లేని సేంద్రీయ ఉత్పత్తులు కనుగొనినారు. తదుపరి గోడౌన్ చెక్ తనిఖీ చేసి సంబందిత లైసెన్సులు పరిశీలించగా, సదరు ఫరమ్ వ్యాపారి కి పురుగు మందులు, ఎరువులు అమ్ముటకు మాత్రమే అనుమతి కలదు. కానీ సదరు వ్యాపారి బిల్లులు/ ఇన్వాయిసులు లేకుండా రసాయనిక ముడిపధార్థములు తెచ్చి సేంద్రీయ ఉత్పత్తులు ముసుగులో రసాయనాలు కలిపి నకిలీ మందులు తయారుచేయుచున్నారు. తదుపరి గోడౌన్ లో పరిశీలించగా ఏ విధమైన లేబుల్స్, బిల్లులు లేనటువంటి 5 రకాల ముడిపధార్థములు కనుగొనుట జరిగినది. మరియు సదరు వ్యాపార స్థలములో మందులను తయారు చేసి అమ్ముటకు కావలసిన అట్టపెట్టెలు , ముడిపధార్థములు, ఖాళీ సీసాలు, ప్యాకింగ్ చేయుటకు కావలసిన లేబుల్స్ మొదలగు మెటీరియల్స్ కలవు. కావున బిల్లులు లేనటువంటి ముడిపధార్థములు మరియు రసాయనిక మందులు అయినటువంటి మెగ్నీషియం సల్ఫేటు మందులను అక్రమ ఉత్పత్తులు గా గుర్తించట మైనది. మరియు గోడౌన్ లో వున్న సేంద్రీయ పదార్థములు అన్నియు "శివ ప్రసాద్" అను ఒకే వ్యక్తిపై మాత్రమే ఇన్వాయిస్ చేయబడి వచ్చివున్నవి. కావున సదరు వ్యాపారి వుద్దేశ్య పూర్వకంగా అక్రమ ధనార్జన కొరకు సేంద్రీయ పదార్థములు అను ముసుగులో రసాయనాలు కలిపి రైతులను మోసగించుచున్నాడని కనుగొనినారు. గోడౌన్ లో వున్న రూ.1,47,32,256/- విలువ కల సేంద్రీయ పదార్థములు మరియు రూ.41,220/- ల విలువ కల అనుమతి లేని ముడిపధార్థములు మొత్తం విలువ రూ.1,47,73,476/- కలవి స్వాధీన పరచుకొని సదరు సంస్థ యజమానిపై మేడికొండూరు పోలీసు స్టేషను లో సెక్షన్ 420 క్రింద క్రిమినల్ కేసు నమోదు చేయవలసినదిగా స్థానిక వ్యవసాయ అధికారిని విజిలెన్స్ అధికారులు ఆదేశించినారు. పై తనిఖీలలో విజిలెన్స్ ఎన్ఫోర్సు మెంట్ అగ్రికల్చరల్ ఆఫీసర్ శ్రీ కె.రమణకుమార్, సబ్ ఇన్స్పెక్టర్ ఎం.రామ చంద్రయ్య , స్థానిక వ్యవసాయ శాఖ అధికారి నాగరాజు, స్థానిక వి ఆర్ ఓ, ఇతర సిబ్బంది పాల్గొనినారు.

# ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు, సీఎం రేవంత్ రెడ్డి ని ఆహ్వానించిన విప్ లక్ష్మణ్ కుమార్,ఈవో శ్రీనివాస్

**టీ మీడియా, మార్చి 15, ధర్మపురి :**

ధర్మపురిలో ప్రసిద్ధి గాంచిన శ్రీ లక్ష్మి నర్సింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 20వ తేదీ నుండి ప్రారంభం కానున్న నేపథ్యం లో ముఖ్య అధితిగా సీఎం రేవంత్ రెడ్డి ని ఆహ్వానించిన ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్,ఆలయ కమిటి ఈవో శ్రీనివాస్, ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు,ధర్మపురి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దినేష్,పాల్గొన్నారు.

# సీఏఏ అమలుపై స్టే కోరుతూ పిటిషన్‌లు..

**విచారణకు అంగీకరించిన సుప్రీంకోర్టు**

**టీ మీడియా, మార్చి 15, న్యూఢిల్లీ:**

కేంద్ర సర్కారు ఇటీవల నోటిఫై చేసిన 'పౌరసత్వ సవరణ చట్టం' అమలుపై స్టే విధించాలంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఆ పిటిషన్‌లపై మార్చి 19న విచారణ జరపనున్నట్లు శుక్రవారం వెల్లడించింది. సీఏఏ రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై తీర్పు వచ్చే వరకు ఆ చట్టం అమలును నిలిపివేయాలని కోరుతూ కేరళకు చెందిన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ఇటీవల అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌ల తదితర పొరుగు దేశాల నుంచి భారత్‌కు శరణార్థులుగా వచ్చిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వాన్ని కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏను) తీసుకొచ్చింది. కేంద్ర హోంశాఖ ఇటీవలే ఆ చట్టాన్ని నోటిఫై చేసింది. అయితే దానిపై కొన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇది రాజ్యాంగ విరుద్ధం, వివక్షాపూరితమైందంటూ ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ చట్టం అమలును నిలిపివేయాలని తన పిటిషన్‌లో పేర్కొంది. అలాగే అత్యవసర విచారణ చేపట్టాలని కోరింది. 'మంగళవారం దీనిపై వాదనలు వింటాం. మొత్తం 190కి పైగా కేసులు ఉన్నాయి. అన్నింటినీ విచారిస్తాం' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పిటిషనర్‌ల తరపు న్యాయవాదులకు తెలిపారు.

**మహానంది క్షేత్రంలో...**

# భక్తులకు బస్ షెల్టర్ లేదు కానీ..

## హెలిపాడ్ నిర్మాణానికి ప్రయత్నాలు

**టీ మీడియా, మార్చి 14, మహానంది:** మహానంది క్షేత్రంలో భక్తులకు కావాల్సిన బస్టాండ్ లేదు,బస్ షెల్టర్ కూడా లేదు. అయినా కూడా మహానంది క్షేత్రంలో హెలిపాడ్ నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వాసనీయ సమాచారం. దీనికి అడ్డుకట్టపడేనా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆలయ అభివృద్ధిని ఎవరు అడ్డుకోరు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం అడ్డదారులు తొక్కితే వారిని ఏమనాలి అనే చర్చ, గ్రామస్థుల మధ్య భక్తుల మధ్య కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. గురువారం మహానంది దేవస్థానం ఉద్యోగ సంఘాలు, దేవస్థానం మాజీ పాలకమండలి అధ్యక్షులు , మహానంది గ్రామస్థుల ఆధ్వర్యంలో దీనిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగానే మహానంది క్షేత్రంలోని పెద్దనంది సమీపంలో హెలీ ప్యాడ్ నిర్మిస్తే, ఆలయ భూమికి నష్టం జరగడమే కాక మహాశివరాత్రి, ఉగాది ,కార్తీక మాసం, తదితర పర్వదిన సందర్భాలలో సాధారణ భక్తులకు సంబంధించిన వాహనాల పార్కింగ్, ఇతర సమస్య లు తలెత్తే అవకాశం ఉందని హెలిపాడ్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి వినతి పత్రాన్ని అందజేసినట్లు సమాచారం. వివిఐపీల కొరకు లేదా భక్తుల సౌకర్యం కొరకు మాత్రం హెలిపాడ్ నిర్మాణం చేయడానికి ప్రయత్నాలు జరగడం లేదని కేవలం ఒకబడా నేత భూమి మహానంది క్షేత్రంలోని పెద్ద నంది సమీపంలో ప్రస్తుతం వాహనాల పార్కింగ్ కొరకు వినియోగిస్తున్న స్థలాన్ని అనుకొని ఉందని,కానీ ప్రస్తుతం ఆ స్థలానికి ఎటు కూడా దారి లేదు.కేవలం ప్రస్తుతం పార్కింగ్ కోసం వినియోగిస్తున్న ఆలయ భూమి నుండి మాత్రమే రాకపోకలు జరపాల్సి ఉంటుంది. ఆలయ భూమిలో హెలిపాడ్ నిర్మిస్తే తమ స్థలాలతోపాటు ఇతర భూములకు కూడా విలువ వస్తుందని భావిస్తూ హెలిప్యాడ్ నిర్మాణానికి బడా బాబు తెర లేపినట్లు తెలుస్తుంది. మహానంది క్షేత్రంలో భక్తులకు కనీస మౌలిక వసతులు కరువు అయ్యాయని కనీసం షెల్టర్, బస్టాండ్ సౌకర్యం కూడా లేదని వీటిని కల్పించాలని కోరుతూ ఆలయ ఉద్యోగ సంఘం లతోపాటు మాజీ పాలక మండలి సభ్యులు, గ్రామ పెద్దలు శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి వినతి పత్రాన్ని గురువారం అందజేశరు. హెలిప్యాడ్ నిర్మాణం వల్ల భక్తులకు ఉపయోగం లేదని ఆగమ శాస్త్రానికి ఆలయ సాంప్రదాయాలకు విరుద్ధంగా ఆలయ ప్రధాన రాజగోపురం కంటే ఎత్తు భాగంలో ఎలాంటి లోహవిహంగాలు తిరగడానికి వీలులేదని సూచించినట్లు సమాచారం. గతంలో కూడా పెద్ద నంది ముందు భాగంలో ఉన్న ఆలయానికి చెందిన భూమిలో ఒకసారి ఒక సామాజిక వర్గానికి చెందిన సత్రాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించినట్లు సమాచారం. రెండవ సారి యూనిసెఫ్ పేరుతో అక్కడ నిర్మాణాలు చేపట్టడానికి ప్రయత్నించినట్లు తెలుస్తుంది. మూడవ సారి ఏషియన్ పసిఫిక్ రీజియన్ పేరుతో హెలి ప్యాడ్ నిర్మాణానికి ఒత్తిడి తీసుకొని వస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దాదాపు 15 సంవత్సరాలు నుంచి వివిధ రకాల నిర్మాణాల పేరుతో ఆలయ భూమిలో చేపట్టడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది ప్రిన్సిపల్ సెక్రటరీ మరియు దేవాదాయ కమిషనర్ దృష్టికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తీసుకుపోయినట్లు సమాచారం.